క్లుప్తంగా

దోమల నివారణ మందు పిచికారీ

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో దోమల నివారణ మందును బుధవారం పిచికారీ చేశారు. దోమలు అధికంగా ఉన్న మురుగు డ్రెయిన్లు, చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మూడు రోజుల పాటు మందు పిచికారీ చేస్తామని క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి, ద్వారంపూడి భాస్కరరెడ్డి, ఛత్రపతి శివాజీ, సబ్బెళ్ల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కారం



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని సత్కరించిన ఎంపీటీసీ సభ్యుడు వెంకటకృష్ణ తదితరులు

రంగంపేట: మండలంలోని దొంతమూరులో ఎస్సీ సామాజిక వర్గానికి శ్మశాన వాటిక లేక గత 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గోలి వెంకటకృష్ణ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించారు. దీంతో ఎంపీటీసీ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ సామాజిక వర్గ నేతలు ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

రంగంపేట: మండలంలోని ఈలకొలనులో సారా కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం రాత్రి ఆమె మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు ఈలకొలనులో దాడులు నిర్వహించి 35 లీటర్ల సారా, 400 లీటర్ల బెల్లపు ఊట కలిగి ఉన్న కుక్కల సూరిబాబును అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టుకు తరలించామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: రామచంద్రపురానికి చెందిన గొల్లపల్లి సాయిని సారాతో అరెస్ట్ చేశామని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురం శివారున సారా ప్యాకెట్లు అమ్ముతుండగా దాడి చేసి సాయిను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

రంగంపేట: పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం చండ్రేడు గ్రామ శివారులో పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.7,750 స్వాధీనం చేసుకున్నామన్నారు.

సామాజిక సమతా సంకల్పం



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ గంగరాజు

రంగంపేట: మండలంలోని వెంకటాపురంలో పంచాయతీ కార్యదర్శి కాత్యాయని ఆధ్వర్యంలో బుధవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ముంగి గంగరాజు పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ బొంతు సత్తిబాబు, కన్నాబత్తుల విజయబాబు, పంది శ్రీకాంత్, గోలి రాజు, గోలి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

జీవ నియంత్రణ పద్ధతిలో మేలైన దిగుబడులు



కోటపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు

రంగంపేట: జీవ నియంత్రణ పద్ధతిలో వ్యవసాయం చేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు అన్నారు. బుధవారం మండలంలోని కోటపాడులో బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యయన విద్యార్థులు నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సేద్యంలో జీవ నియంత్రణ పద్ధతులు ఏ విధంగా ఉపయోగిస్తే మంచి దిగుబడిని సాధించవచ్చో విద్యార్థులు జ్యోతి, లాస్య, మౌనిక, కల్పన, మాధవి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు గుగ్గిల వెంకటేశ్వరరావు, విష్ణు, గవరసాని రాజు, వెంకటరమణ, చిక్కాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధాన్యోస్మి..

- రైతులకు అండగా ప్రభుత్వం
- తడిసిన ధాన్యం కొనుగోలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పుడమి పుత్రులు

సీతానగరం: దేశానికే అన్నం పెడుతున్న రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.. కొండంత ఆసరాగా ఉంటోంది.. ప్రకృతి విపత్తులు ఎదురైతే వెంటనే ఆదుకుంటోంది.. పరిహారం సకాలంలో అందిస్తూ బాసటగా నిలుస్తోంది.. ఇటీవల మిచాంగ్ తుపాన్‌తో కురిసిన అధిక వర్షాలతో ఖరీఫ్ పంట ముంపులోకి వెళ్లింది. ఈ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొని రైతులకు భరోసా కల్పించింది. సీతానగరం మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో పీఏల్‌ఏ- 1,100 (పీఎల్) రకం వరి పంట తడిచిపోవడంతో రైతుల నుంచి ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. మిచాంగ్ తుపానుకు ముందు సాంబ మసూరి (బీపీటీ-5,204) రకం వరి పంటను యంత్రాలతో కోసి, పంట పొలాల కళ్లాల్లోనే ఆరబెట్టి ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకాలు జరిపారు. తర్వాత ఒక్కసారిగా మిచాంగ్ తుపాన్ విరుచుకుపడటంతో పీఎల్ రకం వేసిన రైతులు ఆందోళన చెందారు. కోతలు జరిపే సమయంలో తుపాన్ కారణంగా ఒకరోజు రాత్రి 18 సెంటీమీటర్ల పైగా వర్షపాతం నమోదు కావడంతో వరి పంట ముంపులోకి వెళ్లింది. రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. అప్పులు చేసి పండించిన పంట నోటికాడకు వచ్చి ముంపులోకి వెళ్లడంతో పూర్తిగా నష్టపోయామని ఆవేదనతో ఉన్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని చెప్పడంతో వారి మోములో దరహాసం వెల్లివిరిసింది. ఇచ్చిన మాటకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకుంది.

చిగురించిన ఆశలు

ముంపులో ఉన్న వరి పంటను ఒబ్బిడి చేసుకుని రైతులు అమ్మకాలు జరపవచ్చని, వారి నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని సీఎం జగన్ ప్రభుత్వం చెప్పడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. చేతికి రాదు అనుకున్న పంటను ఒబ్బిడి చేసి, కూలీలతో కోతలు జరిపి, చేతికి వచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టి ఆర్బీకేల ద్వారా ధాన్యం విక్రయించారు. ఇలా రైతులు నష్టాల నుంచి బయట పడ్డారు.



చినకొండేపూడిలో రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలు

సీఎంకు రుణపడి ఉంటాం..



ఖరీఫ్‌లో ఎనిమిదిన్నర ఎకరాల్లో వరి పంట వేశాను. మిచాంగ్ తుపాన్‌తో మొత్తం తడిచి పోయింది. రెండు ఎకరాల పంట పూర్తిగా పోయింది. మిగిలిన ధాన్యం ఒబ్బిడి చేశాను. తక్కువ దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ముందుకు వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

– శూల దుర్గారావు, లంకూరు

మేమున్నామనే భరోసా ఇచ్చి..



రెండు ఎకరాల మూడు కుంచాలలో వరి పంట వేశాను. తుపాన్‌కు పంట తడిచిపోవడంతో అధైర్య పడవద్దని ప్రభుత్వం ధైర్యం ఇచ్చింది. ఎకరానికి 36 కాటాలు దిగుబడి వచ్చింది. తుపాన్ లేకపోతే 45 కాటాల వరకూ దిగుబడి వచ్చేది. ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు చేయడంతో ఎంతో మేలు జరిగింది. లేకుంటే ప్రైవేట్ వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనేవారు. మాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

– కొరవటి చింతయ్య కాపు, కౌలురైతు, వంగలపూడి

ముందే వచ్చిన సం'క్రాంతి'



రంగంపేటలో భోగిమంట వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకొంటున్న విద్యార్థులు



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోడి పందేలు, హరిదాసులు, గాలిపటాలు, నెమళ్లు, హంసలు, చెరకు గడలు, వరి పొలాలతో కూడిన రంగవల్లులతో కళాశాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ పోటీలో మొదటి, ద్వితీయ బహుమతులను ప్రథమ సంవత్సర బీఎస్సీ విద్యార్థినులు జె.దివ్య, కె.సంతోషి, తృతీయ బహుమతిని సెకండియర్ బీకామ్ విద్యార్థిని వి.కావ్య గెలుచుకున్నారు. మ్యూజికల్ చైర్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను హారిక, కె.సంతోషి దక్కించుకున్నారు. కళాశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి విద్యార్థులంతా సందడి చేశారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో గగన్ టీమ్‌పై లోకేష్ టీమ్, కబడ్డీ పోటీల్లో అజయ్ టీమ్‌పై చిన్ని కృష్ణ టీమ్‌లు విజయం సాధించాయి. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు భోగి మంట వెలిగించి దాని చుట్టూ తిరుగుతూ సందడి చేశారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు నాగేశ్వరరావు, సుబ్బారావు, మాధవ్, సుధామయి, వాణి, మీనాక్షి, అలేఖ్య, వరలక్ష్మి, ప్రసాద్, ఫణీంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాల ఆవరణలో భోగి మంట వేసి సంక్రాంతి గీతాలు ఆలపించారు. అనంతరం గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి



ప్రసాద్ (ఫైల్)

రాజానగరం: మండలంలోని నందరాడకు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) కొల్లాటి ప్రసాద్ (40) మృతి చెందాడు. రాజానగరంలో నివాసం ఉంటున్న ఆయన కార్యాలయంలో విధులు ముగించుకుని బైకుపై రాజానగరం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. తలకు హెల్మెట్ ఉన్నా అతనిని కాపాడలేకపోయింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

18న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో వినియోగదారులు తీసుకువెళ్లని వస్తువులకు 18న బహిరంగ వేలం నిర్వహిస్తామని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ బుధవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక బస్ స్టేషన్‌లోని పార్శిల్ ఆఫీస్ వద్ద వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న పాటదారులు పాల్గొనవచ్చని అన్నారు.

వైల్డ్ లైఫ్ వార్డెన్ చైర్మన్ మందారెడ్డికి అభినందన



వైల్డ్ లైఫ్ వార్డెన్ చైర్మన్ సత్తి మందారెడ్డిని సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: వైల్డ్ లైఫ్ వార్డెన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సత్తి మందారెడ్డిని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డితో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. బుధవారం రామవరం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మందారెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యాపారరీత్యా విశాఖపట్టణంలో స్థిరపడ్డ మందారెడ్డి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీ విజయానికి తన వంతు కృషి చేశారన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, సచివాలయం కన్వీనర్ నల్లమిల్లి సూర్రెడ్డి, కర్రి గాంధీరెడ్డి, కర్రి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి వేణుకు వినతి



మంత్రి వేణును కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నర్సరీ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు బుధవారం మంత్రి, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరంలో కలసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ మీటర్లు, పాలీ హౌస్ రాయితీ బకాయిల విడుదల తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు పోలరాజు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, రైతులు ఉన్నారు. అంతకు ముందు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

సీఎం జగన్‌తో ప్రతి గడపకూ సంక్షేమం

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం
- జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి



వెంకాయమ్మపేటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమాన్ని ప్రతి గడపకూ తీసుకొచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం హుకుంపేట సచివాలయం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన పార్టీ సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను సీఎం జగన్ రూరల్ కోఆర్డినేటర్‌గా నియమించారని, ప్రజలంతా ఆయనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. సచివాలయం-1 కన్వీనర్లు పసలపూడి శ్రీనివాస్, పేరూరి శేషాద్రి, పార్టీ మండల కార్యదర్శి కుప్పాల రాంబాబు, మండల చేనేత విభాగ అధ్యక్షుడు ఈర్లు నాగబాబు, సుందరంపల్లి అనిల్ పాల్గొన్నారు.

కడియం: రాష్ట్రంలో ప్రతి పేదవాని బాగు కోసం సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కడియపులంక పంచాయతీ పరిధి వెంకాయమ్మపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కడియపులంక సచివాలయం-4లో ఇప్పటి వరకూ రూ.24.23 కోట్లు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, అయితరెడ్డి వెంకటస్వామి, దాసరి శ్రీనివాస్, రంబాల దుర్గారావు, గండి రమణ, తిరుకోటి నాగేశ్వరరావు, కూసి సూర్యనారాయణ, బోడపాటి మూర్తి, కె.శేఖర్, మాచరయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తే లక్ష్యం



ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



దోసకాయలపల్లిలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు



నన్నయ వర్సిటీ మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



జి.మామిడాడలో ఉత్కంఠగా సాగుతున్న కబడ్డీ పోటీలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభం

అనపర్తి: గ్రామీణ ప్రాంతాల్లో యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వారికి బంగారు భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. క్రీడా రంగంలో యువతను సమున్నత రీతిలో ప్రోత్సహించి వారు జాతీయ స్థాయిలో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా క్రీడా మైదానాలు క్రీడాకారులతో కళకళలాడుతున్నాయన్నారు. క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా నిర్వహిస్తున్న ఈ పోటీల ద్వారా గ్రామీణ స్థాయి నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందన్నారు. అనంతరం ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ గుబ్బల అలేఖ్య, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఎంఈఓలు బి.పుష్పలత, నల్లమిల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: ఆడుదాం- ఆంధ్ర ఆటల పోటీలతో ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసం కలుగుతుందని కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం దోసకాయలపల్లిలో మండల స్థాయి క్రీడా పోటీలను పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలతో గ్రామాలకు ముందే సంక్రాంతి వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. దోసకాయలపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో 16 జట్లు 8 మ్యాచ్‌ల్లో మొదటి రౌండ్‌లో తలపడ్డాయి. గురువారం క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ జరుగుతాయి. బూరుగుపూడి కంటే వినయ్‌తేజ గ్రౌండ్‌లో జరిగిన వాలీబాల్ పోటీలను ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో 16 జట్లు 8 మ్యాచ్‌ల్లో మొదటి రౌండ్‌లో తలపడ్డాయి. గురువారం క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ నిర్వహిస్తారు.

రాజానగరం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల స్థాయిలో కబడ్డీ, క్రికెట్ పోటీలను ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఇంతవరకూ మండలంలోని 34 గ్రామ సచివాలయ స్థాయిలో జరిగిన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు. రోజుకు 6- 7 జట్ల చొప్పున 20వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని, వీటిలో ఎంపికైన వారు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు వెళ్తారని సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రభుత్వం అందజేసిన టీ షర్టులు, టోపీలను ధరించి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

పెదపూడి: ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ డీఆర్‌కేరెడ్డి డిగ్రీ కాలేజీ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ తులసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ విభాగాల్లో జరుగుతున్న పోటీల్లో 20 సచివాలయాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌కేరెడ్డి విద్యా సంస్థల అధినేత డీఆర్‌కేరెడ్డి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, పీడీ గిరి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి యత్నించి పట్టుబడిన విద్యార్థులు

రంగంపేట: స్థానికంగా పార్కు చేసి ఉంచిన మోటారు సైకిళ్లను విద్యార్థులు ఎత్తుకెళ్లేందుకు యత్నించిన సంఘటన రంగంపేట మండలం ఈలకొలనులో బుధవారం తెల్లవారుజామున జరిగింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరంలో ఓ కార్పొరేట్ కళాశాలలో చదువుకుంటున్న ఆరుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు బుధవారం తెల్లవారుజామున మోటార్ సైకిళ్లపై వచ్చి ఈలకొలనులో ఆరు బయట పార్కు చేసిన మోటారు సైకిళ్లను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు అప్రమత్తమై పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై రంగంపేట పోలీసులను వివరణ కోరగా విద్యార్థులు మోటారు సైకిళ్లను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించడం వాస్తవమేనని, ప్రస్తుతం వారు పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్నారన్నారు. ఇంకా వారిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సీతానగరం/మధురపూడి: సంక్రాంతి పండగల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగల మూడు రోజులూ ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోడి పందేలు, గుండాటలు, మూడు ముక్కలాటలు, స్కిల్ కాయిన్స్, బాలాట, అక్రమ మద్యం అమ్మకాలు జరిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.సోమశేఖర్ ఆదేశాల మేరకు రైడ్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, వారు నిత్యం పర్యవేక్షిస్తారని సత్యనారాయణ తెలిపారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పన ద్వారా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ పంచాయతీ నిధులు రూ.46 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన సీసీ రహదారిని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త సబ్బెళ్ల అమ్మిరెడ్డి, సబ్బెళ్ల జనార్ధనరెడ్డి, చిట్టి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, సుకాసుల శివ, సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచార షెడ్యూల్‌లో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ కోరుకొండ సచివాలయ కన్వీనర్ పసుపులేటి బుల్లియ్యానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పత్తి పాపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హంస వాహనంపై గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు హంస వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం స్వామి వారికి సుప్రభాతసేవ, లఘు అర్చన, తోమాల సేవ, పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు బుధవారం భోజన విరామానికి ముందు గంట పాటు సమ్మెకు దిగారు. జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని, నూతన పింఛను పథకంలో ఉద్యోగులకు యాజమాన్య వాటాను 14 శాతానికి పెంచాలనే తదితర అంశాల్లో యాజమాన్య ఏకపక్ష వైఖరిని ఖండిస్తూ నిరసన తెలిపారు. అన్ని తరగతుల ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం స్పందించకుంటే నిరసన ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగుల సంఘ నాయకులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్, పి.సతీష్ , డెవలమెంట్ ఆఫీసర్స్ నాయకులు కె.అశోక్, క్లాస్-1 అధికారుల సంఘ నాయకులు ప్రసాద్, ఉద్యోగ సంఘాల నాయకులు ఈశ్వరరావు, సత్యదేవ, మాథ్యూస్ పాల్గొన్నారు.